క్లుప్తంగా

దరఖాస్తుల గడువు పెంపు

ధర్మసాగర్ : ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేకునేందుకు గడువు పొడగించినట్లు ఎంఈఓ రాంధన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్‌లో గల క్రీడా పాఠశాలల్లో 2025 -26 విద్యా సంవత్సరానికి 4వ తరగతి ప్రవేశం పొందేందుకు మండలంలోని విద్యార్థులు ఈనెల 22వ తేదీలోపు సంప్రదించాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ

ఐనవోలు : ఎంపీడీఓగా వి.నర్మద శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ పనిచేసిన పులి వెంకటేశ్వర్లు మార్చి 31న ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. కాగా ఎంపీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న గోపు రఘుపతిరెడ్డికి ఎఫ్ఏసీ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పజెప్పగా.. ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖ నుంచి సోషల్ వేల్ఫేర్ శాఖకు డిప్యూటేషన్‌పై వె ళ్లిన నర్మద తిరిగి ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపూర్ : మండలంలోని శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ శాఖ ఏఈ రాములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనిగరం, గూనిపర్తి సబ్ స్టేషన్ల పరిధిలోని శనిగరం, మాదన్నపేట, గోపాల్‌పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల, గూనిపర్తి, అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఐనవోలు : ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. రేషన్ బియ్యాన్ని ట్రాలీ ఆటోలో తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ట్రాలీలో రవాణా చేస్తున్న 15.5 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. తేజావత్ ప్రకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సీపీకి రైతు ఫిర్యాదు

కమలాపూర్ : మండలంలోని వంగపల్లిలో తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమి నుంచి సమీప రైతులు వారి భూముల్లోకి వెళ్లేందుకు దౌర్జన్యంగా బాట తీశారని, దీంతో తాను 20 గుంటల భూమి కోల్పోయి సుమారు రూ.50 లక్షలు నష్టపోయానని, అక్రమంగా వేసిన బాట తొలగించి తనకు న్యాయం చేయాలని వంగపల్లికి చెందిన సకీర్త చేరాలు అనే వికలాంగ రైతు వరంగల్ సీపీకి ఫిర్యాదు చేశారు. ఈనెల 13 తన భూమి నుంచి అక్రమంగా రెండు జేసీబీలతో బాట తీస్తుండగా తాను అడ్డుకున్నానని, దీంతో వారు స్థానిక సీఐకి ఫోన్ చేయడంతో కానిస్టేబుల్‌ను పంపించి తనను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి సాయంత్రం వరకు స్టేషన్‌లో నిర్బంధించారని ఆరోపించారు. ఒగ్గి ఐలయ్య తనకు రూ.1.20 లక్షలు బాకీ ఉన్నాడని, ఆ డబ్బులు ఇప్పించాలని గతేడాది సీఐని కోరగా ఇప్పిస్తానని చెప్పి అందుకు సంబంధించిన కాగితం సీఐ వద్దనే ఉంచుకున్నట్లు ఆరోపించారు. తన భూమి నుంచి దౌర్జన్యంగా బాట తీసిన వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని చేరాలు కోరారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ హరికృష్ణను వివరణ కోరగా.. డయల్ 100కు వచ్చిన ఫిర్యాదు మేరకు చేరాలును స్టేషన్‌కు పిలిపించి సమస్య పరిష్కరించుకోమని చెప్పి పంపించామని, అతను చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమలాపూర్ : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా విలాసాగర్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో మండలంలోని ఉప్పల్ వద్ద విలాసాగర్‌కు చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామని, వారి నుంచి ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. దీంతో మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. విలాసాగర్‌కు చెందిన వేల్పుల కుమార్, ముంజాల రాజేష్, బావు రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

శానిటేషన్ పనులు చేపట్టండి



పరకాల : పట్టణంలోని మొదటి వార్డులో పేరుకపోయిన చెత్తాచెదారం లతొలగించి, మురుగు కాల్వలను శుభ్రం చేసి శానిటేషన్ పనులు చేపట్టాలని మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తక్షణమే సానిటేషన్ పనులు చేపట్టాలని కోరారు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- పైలట్ గ్రామం శాలపల్లిలో కొనసాగుతున్న పనులు
- పర్యవేక్షిస్తున్న అధికారులు
- రూఫ్ లెవల్ చేరుకున్న ఇళ్లకు బిల్లుల చెల్లింపు
- లబ్ధిదారుల హర్షం



శాలపల్లి గ్రామంలో రూఫ్ లెవల్‌కు చేరుకున్న ఇందిరమ్మ ఇల్లు

వేలేరు : గూడు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మొదటగా మంజూరు చేసిన పైలెట్ గ్రామం శాలపల్లిలో ఇళ్ల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇళ్లు లేని పేదలను అధికారులు గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. గ్రామంలో మొత్తం 79 మంది అర్హులను గుర్తించి 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటిని నిర్మించాలనే నింబంధనల మేరకు అధికారులు ముగ్గులు పోశారు. 50 మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించగా.. అందులో 35 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు పూర్తిచేయడంతో లక్ష చొప్పున, 10 ఇళ్లు రూఫ్‌లెవల్ వరకు పూర్తయ్యాయి. వీటికి రెండో విడతలో మరో లక్ష చొప్పున ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. ఇళ్ల నిర్మాణంపై ఎప్పటికప్పుడు మండల, జిల్లాస్థాయి అధికారులు, హౌసింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లులు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో త్వరగా జమ అవుతుండటంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోతున్నాయని పలువురు అంటున్నారు.

నాలుగు దఫాలుగా బిల్లుల చెల్లింపు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం నాలుగు దఫాలుగా బిల్లులు చెల్లించనుంది. బేస్‌మెంట్ వరకు పూర్తిచేసిన వెంటనే అధికారులు ఫొటోలు తీసి యాప్‌లో అప్లోడ్ చేస్తారు. దీంతో వారంలోనే లక్ష చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. రూఫ్ లెవల్, గోడల నిర్మాణం పూర్తి కాగానే రెండో విడతలో మరో లక్ష, స్లాబ్ నిర్మాణం పూర్తయ్యాక రూ.2 లక్షలు, ప్లాస్టింగ్, డోర్లు, కలర్స్ వేశాక మరో లక్ష రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుంది.

రూ.2 లక్షలు జమయ్యాయి



గతంలో మేము ఏ ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇంటి నిర్మాణం చేపట్టి బేస్‌మెంట్ పూర్తిచేసిన తర్వత లక్ష, రూఫ్ లెవల్ పూర్తయిన తర్వాత రెండో విడతలో మరో లక్ష, మొత్తం రూ.2 లక్షలు ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి.

\- కూరపాటి మణెమ్మ, శాలపల్లి

పేదల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరాణి



చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఝాన్సీరాణి

కమలాపూర్ : పేదల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణి అన్నారు. మండల కేంద్రంలోని చేనేత పారిశ్రామిక సహకార సంఘంలో పనిచేస్తున్న పలువురు నిరుపేద చేనేత కార్మిక కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవడంపై చేనేత కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నెరవేరుస్తోందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కూడా సకాలంలో అందిస్తుందని, ఏ గ్రామానికి వెళ్లినా రైతుల నోట రైతు భరోసా వచ్చింది అని సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిన్నెర కృష్ణమూర్తి, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పుల్లూరి శ్రీనివాసరావు, నాయకులు విష్ణుదాసు వంశీధర్‌రావు, ప్రసాద్, అశోక్, చంద్రశేఖర్, సాంబయ్య, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు

- ప్రధానోపాధ్యాయురాలు సుష్మ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సుష్మ

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రగతిసింగారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుష్మ అన్నారు. మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, నోట్ బుక్కులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ మహేందర్



మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్

ధర్మసాగర్ : మండలంలోని వివిధ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని పల్లె దవాఖాన వైద్యాధికారి పుట్ట మహేందర్ సూచించారు. పెద్ద పెండ్యాలలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లోని విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకుని భోజనం చేయాలని, మల, మూత్రవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యా యుడు మల్లారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం రజిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

వేలేరు : మండలంలోని పీచర శివారు వావిల్లకుంట తండా, కన్నారం శివారు ఇప్పుల్లపల్లి గ్రామాలను కలిపి నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వావిల్లకుంట తండా పీచర గ్రామానికి సుమారు 8 కిలో మీటర్ల దూరంలో ఉందని, ఇప్పుల్లపల్లి కన్నారం గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. రేషన్ బియ్యం, వైద్యం, బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 500 జనాభా ఉండే దళిత, గిరిజన పల్లెలను కలిపి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తే ప్రజలకు అన్ని కష్టాలు తొలగిపోతాయని ఎమ్మెల్యేను కోరారు. నాయకులు ప్రమోద్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, అంజి, సతీష్, రాజు, తిరుపతి, సారయ్య పాల్గొన్నారు.

'భూ భారతి'కి దరఖాస్తుల వెల్లువ

పరకాల : ఈనెల 3 నుంచి 20వ తేదీ వరకు పరకాల రెవెన్యూ డివిజన్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో 11,367 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆర్డీఓ డాక్టర్ నారాయణ ఓ ప్రకటనలో వెల్లడించారు. మండలాల వారీగా ఆత్మకూరు 3,069, దామెర 2,071, పరకాల 2,520, శాయంపేట మండలంలో 3,707 దరకాస్తులు వచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ఆర్డీఓ స్పష్టం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: కాజీపేట మండలంలో సోమిడిలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరంలో స్పాట్ కౌన్సిలింగ్ ఈనెల 24న నిర్వహిస్తున్నామని అర్హులైన ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. సునీత శుక్రవారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీఎస్, ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్, బీజెడ్‌సీ, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్, బీఏ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయని, అర్హులైన విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 94916 85294, 96768 17038, 95058 06053 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

విశ్వనాథ కాలనీలో ఇరువర్గాల గలాట



ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని విశ్వనాథ కాలనీలో గలాట చోటుచేసుకుంది. రెండు రోజులుగా భూమి విషయంలో గ్రామంలో జరుగుతున్న గొడవ కాస్త శుక్రవారం తీవ్రస్థాయికి చేరుకుంది. సర్వే నంబర్ 272లో తలెత్తిన వివాదం గ్రామస్తుల మధ్య గొడవకు దారితీసింది. గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి సారయ్యకు సంబంధించిన రేకుల షెడ్డు, గడ్డి కట్టలను కొందరు గ్రామస్తులు తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

వసతిగృహాల్లో మెనూ పాటించాలి

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని వసతిగృహాలను అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు శుక్రవారం పరిశీలించారు. ముల్కనూరులోని బాలికల వసతిగృహం, ఎస్సీ బాలుర వసతి గృహం, భీమదేవరపల్లిలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను తనిఖీ చేశారు. మెనూకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. వసతి గృహాల్లోని సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే అన్ని సదుపాయాలను సమకూర్చాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. భోజనానికి సంబంధించిన రోజువారీ మెనూ సూచిక పాటించాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ కుమారస్వామి, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకనే విమర్శలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొంతమంది నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీహరిని వ్యక్తిగతంగా విమర్శిస్తున్న వారికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.800 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతుంటే ఆయనను టార్గెట్ చేస్తూ మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు రణధీర్‌రెడ్డి, ప్రశాంత్, సలీంమాలిక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆగయే.. చలేగయే

- సమయపాలన పాటించని అధికారులు, సిబ్బంది
- ఖాళీ కుర్చీలే దర్శనం
- పశు వైద్యశాల, ఆయుర్వేద దవాఖాన, సబ్ సెంటర్లకు తాళం



శాయంపేటలో తాళం వేసిఉన్న పశు వైద్యశాల



ప్రగతిసింగారంలో ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ



నేరెడుపల్లిలో తాళం వేసిన ఆయుర్వేద వైద్యశాల

శాయంపేట : మండలంలోని పలు డిపార్ట్‌మెంట్‌లకు చెందిన అధికారులు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలోని పశు వైద్యశాల సిబ్బంది ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉన్నా సాయంత్రం 3గంటలకే తాళం వేసి వెళ్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రగతిసింగారంలో సబ్‌సెంటర్..

మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాల్సిన వైద్యాధికారి సబ్‌సెంటర్‌లో లేకపోవడంతో ఖాళీ కుర్చీ దర్శనమిచ్చింది. విధుల్లో ఉన్న ఏఎన్‌ఎం నిర్మలను ప్రశ్నించగా ఉదయం గంగిరేణిగూడెంలో హెల్త్ క్యాంపు నిర్వహించారని మధ్యాహ్నం 12.30 గంటల వరకు క్యాంపులో పాల్గొని అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయారని తెలిపారు.

నేరేడుపల్లిలో ఆయుర్వేద ఆసుపత్రి..

నేరేడుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సిబ్బంది, వైద్యులు కనిపించలేదు. ఉదయం తలుపులు మాత్రమే తెరిచి ఉండగా మధ్యాహ్నం నుంచి తాళం వేసి వెళ్లిపోయారు. అలాగే మండల కేంద్రంలోని పశు వైద్యశాల, ఇతర ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాల్లో గల ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలల్లో అధికారులు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకుని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా-2005 ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

ఆత్మకూరు (దామెర) : యోగా సాధనతో ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా శిక్షకురాలు డాక్టర్ ఇందిర అన్నారు. దామెర మండలంలోని ఒగ్లాపూర్ కేర్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం కళాశాల, భారత్ వికాస్ పరిషత్ సంయుక్త నిర్వహణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. డాక్టర్ ఇందిర విద్యార్థులకు యోగాలో పాటించాల్సిన మెళకువలు వివరించారు. ఆమె మాట్లాడుతూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగా తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్‌కుమార్, భారత్ వికాస్‌పరిషత్ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది రవికృష్ణ, స్నిగ్ధ, మాధురి తదితరులు పాల్గొన్నారు.

డిస్నీల్యాండ్‌లో...

దామెర మండలం ఒగ్లాపూర్ డిస్నీల్యాండ్ పాఠశాలలో యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు వినూత్న రీతిలో యోగా 2005 ఆకారంలో కూర్చొని పలువురుని ఆకట్టుకున్నారు. పాఠశాల వ్యవస్థాపకులు మల్లయ్య, సదయ్య, లక్ష్మీనివాసం, డైరెక్టర్లు శోభారాణి, రాకేష్‌భాను, దినేష్‌చందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణంలో నేడు యోగా వేడుకలు

పరకాల : పతంజలి యోగా పరకాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో శనివారం అంతర్జాతీయ యోగా డే వేడుకలు నిర్వహించనున్నట్లు యోగా గురువు కొలుగూరి రాజేశ్వర్‌రావు తెలిపారు. గణపతి కళాశాల ఆవరణలో 15 రోజులుగా ఉచిత యోగా శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. యోగా వేడుకల్లో పాల్గొనేందుకు ఉదయం 7గంటలకు మార్కెట్ ఆవరణానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

పరకాల : ప్రభుత్వ ఆదేశాల మేరకు పరకాల మండలస్థాయి క్రీడాపాఠశాలలో 4వ తరగతి ఎంపిక కోసం పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను మండల విద్యాశాఖాధికారి రమాదేవి, ప్రధానోపాధ్యాయుడు మధు, పీఈటీలు, పీడీఎస్‌లు పాల్గొన్నారు.

ప్రగతిసింగారంలో పేరుకుపోయిన చెత్తాచెదారం



ప్రగతిసింగారంలో మురుగునీరు, చెత్తాచెదారంతో కంపు కొడుతున్న రోడ్డు

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో చెత్తాచెదారం పేరకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ ఎదుట చెత్తకుప్పలు దర్శనమిస్తుండగా ఈగలు, దోమలు, పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో అనారోగ్య బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అటువైపు వెళ్లాలంటే ముక్కు ముసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్య తీసుకోవాలని స్థానికులు కోరారు.

మద్దతు ధరను చట్టబద్ధం చేయాలి

ఆత్మకూరు : పంటలకు మద్దతు ధర కల్పించి చట్టబద్ధం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కోరారు. మండలంలోని నాగయ్యపల్లిలో రైతులకు జరుగుతున్న నష్టాలు, సమస్యలపై రూపొందించిన షార్ట్ ఫిలింను గురువారం రాత్రి ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన రైతు పోరాటాలు ప్రపంచాన్ని కదిలించాయని అన్నారు. వ్యవసాయరంగానికి జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వర్తింపజేయాలని అన్నారు. వ్యవసాయ కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వాలు మారినా రైతుల జీవన విధానం, వ్యవసాయ రంగంలో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి రైతులు పండించే పంటలకు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాజిరెడ్డి, నర్సిరెడ్డి, రవీందర్, సుగుణాకర్, వీరన్న, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.